క్లుప్తంగా

ఓవర్‌లోడ్ నివారణకే అదనపు డీటీఆర్‌లు



డీటీఆర్ ప్రారంభిస్తున్న డీఈ, ఏడీఈ, ఏఈలు

రాయికల్: బల్దియాలోని ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా ఓవర్‌లోడ్‌ను నివారించేందుకే అదనపు డీటీఆర్‌లు ఏర్పాటు చేసినట్లు డీఈ రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాయికల్ బల్దియాలోని 1వ వార్డులో డీటీఆర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో నిరవధికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని, ఏదైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ సింధూర్‌శర్మ, ఏఈ తుమ్మల నవీన్, రాజేశం, వార్డు నాయకులు షాకీర్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుల వివరాలు పకడ్బందీగా చేపట్టాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

సారంగాపూర్: రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నూతనంగా రూపొందించిన యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయడంపై శుక్రవారం సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, కారోబార్ గంగాధర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంటలకు మద్దతు ధర



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం కలిగోట, అంబారిపేట, ఇప్పపెల్లి, దుంపేట, దూలూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, డైరెక్టర్లు, నాయకులు కాయితి నాగరాజు, కల్లెడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'యువిక' కు ఎంపికైన అశ్వినికి ప్రశంసలు



అశ్వినిని అభినందిస్తున్న అధికారులు

జగిత్యాల: ఇస్రో ప్రతిష్ఠాత్మక కార్యక్రమం యువిక 2025 శిక్షణకు కొడిమ్యాల ఆదర్శ పాఠశాల విద్యార్థిని అశ్విని ఎంపికవడం పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. డీఈవో రాము మాట్లాడుతూ జిల్లా నుంచి అశ్విని ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని, భవిష్యత్‌లో శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఎస్‌సీఈఆర్టీ ప్రోత్సాహం, జిల్లా సైన్స్ అధికారుల కృషి వల్ల ఎక్కువ మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించేలా ఉపాధ్యాయులు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అశ్వినిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, ఎంఈవో దామోదర్ రెడ్డి, ఫిజికల్ సైన్స్ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పై ఫిర్యాదు

మల్యాల: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇటీవల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిపిరెడ్డి కిషన్ రెడ్డి, సంత ప్రకాశ్ రెడ్డి, వెంకటేశ్, కటుకం వినయ్‌నాయకులు పాల్గొన్నారు.

స్వామి వారి ఊరేగింపు



కథలాపూర్: మండలకేంద్రంలో గుండు పెరమాండ్ల స్వామిని భక్తులు పల్లకిలో శుక్రవారం ఊరేగింపు చేశారు. గ్రామంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామశివారులోని ఆలయం వరకు పల్లకిలో ఊరేగింపు చేశారు. శనివారం జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రామనామ సంకీర్తన నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు, సభాపతి తిగుళ్ల విషుశర్మ పర్యవేక్షణలో 108 కళశాలను స్థాపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రోహిత్‌శర్మ స్వామివారికి అభిషేకం, అష్టోత్తర పూజల అనంతరం రామనామ సంకీర్తన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బట్టు సుధాకర్, ప్రేంకుమార్, ఎర్ర రంజిత్, మానుక సంతోష్, కొత్త మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో శివాలయం, అభయాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాపితదేవతా పూజ, కార్యక్రమాలు, హోమం, యజ్ఞం, ఫలాదివాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఆలయ నిర్మాణ దాతలు చిట్టిరెడ్డి శ్రీనివాస రెడ్డి–చైతన్యజ్యోతి దంపతులు, మాజీ ఎంపీపీ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం అయ్యప్ప జన్మదినం సందర్భంగా ఉత్తర నక్షత్ర ఆరాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి వారికి అష్టాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి సుధీర్ శర్మ, ఇల్లెందుల శ్రీనివాస్ , సంతోష్, వెంకటేశ్, సింగని రమేశ్, యశ్వంత్, శ్రీకాంత్,బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మేడిపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రోజు మార్కండేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మార్కండేయుడికి ప్రత్యేక పూజ నిర్వహించి, పనులు ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమం లో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, జిల్లా,మండల పద్మశాలీ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి

జగిత్యాల/జగిత్యాలటౌన్/కోరుట్ల/మెట్‌పల్లిరూరల్/రాయికల్/ధర్మపురి/మేడిపల్లి/పెగడపల్లి/గొల్లపల్లి/మల్లాపూర్/కథలాపూర్/సారంగాపూర్: పూలే జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి జ్యోతిబాపూలే అని పలువురు కొనియాడారు. మహిళల విద్యకు, వారి విద్య సాధికారత కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, బీసీ సంఘాలు, యువజన,దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, నాయకులు



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న నాయకులు



జగిత్యాల పట్టణంలో..



రాయికల్ తహసీల్ కార్యాలయంలో నివాళి

బీఆర్‌ఎస్ సభకు దండు కట్టండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి/బుగ్గారం: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27 నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలకు బీఆర్‌ఎస్ నేతలు దండుకట్టాలని, గులాబీ శ్రేణులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో, బుగ్గారం మండలం వెల్గొండలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని అబద్ధపు వాగ్దానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెపుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకంట విద్యాసాగర్‌రావు, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్తమ్మ, నాయకులు అయ్యోరి రాజేష్, సొల్ల భీమయ్య, ఒడ్నాల మల్లేశం తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

• కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



సంగెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని సంగెం, నాగులపేట, పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు సింగిరెడ్డి నర్సారెడ్డి, జగన్మోహన్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, కాశిరెడ్డి మోహన్ రెడ్డి, గడికొప్పుల గోపాల్, దుంపాల రాజనర్సయ్య, ఏపీఎం శంకర్,ఫాక్స్ సీఈవోలు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యంపై కాంగ్రెస్ ప్రచారం విడ్డూరం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న యాదగిరి

ఇబ్రహీంపట్నం: ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజలకు ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి అన్నారు. మండలంలోని డబ్బాలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధులు రూ. 1.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రణదీర్, వెంకటేశ్, పాల్గొన్నారు.

గ్రామసభలో ఉద్రిక్తత

వెల్గటూర్ : మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ ఉద్రిక్తతకు దారితీసింది. గత కొద్ది రోజుల క్రితం వెల్గటూర్‌లో చర్చి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒకరు దరఖాస్తు చేశారు. గతంలో రెండు మూడు సార్లు ఈ చర్చి నిర్మాణం విషయంలో గొడవలు జరిగిన దృష్ట్యా గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయం మేరకు చర్చి నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తానని కార్యదర్శి శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో గ్రామస్తులకు, దరఖాస్తు దారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు కల్పించుకుని పోలీసుల సహకారంతో గొడవ సర్దుమనిగేలా చేసి, గ్రామస్థుల అభిప్రాయం సేకరించారు. చర్చి నిర్మాణానికి చాలా మంది వ్యతిరేకించడంతో అనుమతి నిరాకరిస్తున్నట్లు కార్యదర్శి ప్రకటించారు.

రుణమాఫీపై మంత్రికి విన్నవం

కథలాపూర్: రుణమాఫీ విషయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి శుక్రవారం విన్నవించారు. మంత్రి తో జూమ్ మీటింగ్‌లో నాగరాజు పాల్గొన్నారు. భర్త పేరిట భూమి ఉండి భార్య పేరిట పంట రుణం తీసుకున్న వారికి రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ఇదే అంశాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గతంలో అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. కథలాపూర్‌లో ఎక్కువ మంది గల్ఫ్ వెళ్లినవారు ఉన్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కోరుట్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా విజయ్



విజయ్

కోరుట్ల: కోరుట్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది బైరి విజయ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ముబీన్‌పాషా, మచ్చ వెంకటరమణ మూర్తి, సంగ విజయ సాయి తెలిపారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు బైరి విజయ్, తోట ఆంజనేయులు పోటీలో ఉన్నారు. మొత్తం 54 ఓట్లు పోల్ కాగా, బైరీ విజయ్‌కు 36 ఓట్లు, తోట అంజనేయులుకు 17 ఓట్లు ఒక్క ఓటు నోటాకు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం ఆరపేట గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ తాపీ మేస్త్రీ. ఫిబ్రవరి 18, 2023 శివరాత్రి పండుగ రోజు తోటి మేస్త్రీలు, స్నేహితులతో కలిసి తన ఇంటి వద్ద విందు చేసుకున్నారు. సెల్‌ఫోన్ సిమ్‌కార్డు గురించి రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన చెట్‌పల్లి సురేశ్ అహ్మద్ మధ్య గొడవ జరిగింది. మాటమాట పెరగడంతో సురేశ్ ఇనుప రేకుతో అహ్మద్‌పై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. మృతుడి బావమరిది షేక్‌బాబు మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అప్పటి ఎస్సై శ్యాంరాజ్ కేసు నమోదు చేశారు. సీఐ కె.లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి, సురేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, టి.రంజిత్ కుమార్ బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో, పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడైన సురేశ్‌కు యావజ్జీవ శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడు మృతి

మేడిపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్ గురువారం అనారోగ్యంతో మరణించాడు. మరణవార్త విన్న వేములవాడ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సంతాపం ప్రకటించారు. మండలంతో పాటు వెంకట్రావుపేటలో విషాధచాయలు అలుముకున్నాయి.

తల్లిపాలు చిన్నారులకు ఎంతో శ్రేష్ఠం

జగిత్యాలరూరల్/కోరుట్ల/మల్యాల/కథలాపూర్/మల్లాపూర్: తల్లిపాలు చిన్నారులకు ఎంతో శ్రేష్ఠకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం రఘురాములకోట,మల్యాల మండలం తక్కళ్లపల్లి, కథలాపూర్ మండలం దుంపేట, తాండ్ర్యాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో,మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం వేడుకలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

కోరుట్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోరుట్లలో బీజేపీ సత్తా చాటాలని భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బీజేపీ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బద్దం గంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. క్యాక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పీసు రాజేందర్, పట్టణ కన్వీనర్ సుదవేణి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని, దీనికి కార్యకర్తలు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని గంభీర్‌పూర్‌లో బీజేపీ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్ల అంజయ్య, లింగమూర్తి, జలందర్, ప్రణయ్, రఘు, సాయిరెడ్డి, రాజేందర్, నాగేశ్ పాల్గొన్నారు.

గావ్ చలో.. బస్తీ చలో అభియాన్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చింతలపేట,చౌలమద్ది గ్రామాల్లో బీజేపీ నాయకులు గావ్ చలో బస్తీ చలో అభియాన్ నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రధాని మోదీ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని,సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి,నాయకులు నర్సింహారెడ్డి,రమేశ్,మహేశ్,గంగనర్సయ్య, రాజేందర్, శంకర్,రాజేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లిలో శుక్రవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా రేషన్ దుకాణం సందర్శించి సన్నబియ్యం పంపిణీ జరుతున్న తీరును పరిశీలించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం లంబాడి తాండాలోని గిరిజన మహిళ ఇంట్లో సన్న బియ్యం భోజనం చేశారు. కార్యక్రమంలో కన్నం అంజయ్య,మర్రిపల్లి సత్యం, మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ర్యాలీలు

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్, మాదాపూర్, సర్పరాజ్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతిజ్ఞ చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొమటికొండాపూర్ నుంచి ఎర్దండి వరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రతిజ్ఞ చేసి పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు క్యాతం తిరుపతిరెడ్డి, నెరేళ్ల దేవేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కణ విజయవంతం చేయాలి

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్‌లో నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘాల రాష్ట్ర నాయకుడు, అడ్వకేట్ ఎర్ర రమేశ్,అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బట్టు శేఖర్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్, ఇబ్రహీంపట్నంలో చలో కేశాపూర్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పులేరి రాము, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ విభాగంలో ఆఫీసు సబార్డినేటర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వశక్తి సంఘంలో సభ్యులై ఉండాలని 10 వ తరగతి పాసై ఉండాలని, ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన వారై 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని నెలకు వేతనం రూ. 5,200 ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న మహిళలు ఈ నెల 18లోగా ఉపాధి హామీ విభాగంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

'అక్రమార్కులను సహించం'

కోరుట్ల: అధికార పార్టీకి చెందిన నేతల పేరు చెప్పి ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, పార్టీ పేరు చెప్పుకుని తప్పుడు పనులు చేసేవారిని ఉపేక్షించమని కోరుట్ల సెగ్మెంట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో అధికారులపై తమ నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు పెరుమాండ్ల సత్యనారాయణ, ఎంబేరి సత్యం, వాసం అజయ్‌లు పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని అంగడిబజార్‌లో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నాటక మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నాటిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: పట్టణంలోని విద్యానగర్‌లోని టౌన్-2 పరిధిలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రాజిరెడ్డి తెలిపారు. టౌన్-2 పరిధిలోని కాలనీలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మల్యాల: మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

వెల్గటూర్ : ఆయిల్ పాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆయిల్ పాం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మోహన్ అన్నారు. శుక్రవారం కొత్తపేటలో ఆయిల్ పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆసక్తి కలిగిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన అధికారులను గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపులు స్వాధీనం

వెల్గటూర్ : ఎండపల్లి మండలం సూరారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను ఎండపల్లి గిర్దావర్ రాజేశ్వరి శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో అక్రమ ఇసుక నిల్వలపై వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి సుమారు పది ట్రిప్పుల ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.